# రాగ సంధ్య

''ఫోన్ రింగ్ అవుతోంది ఒక్కసారి చూడరూ !'' మంజూ పిలిచింది దినకర్‌ని. ఆమె మాటలు పౌడర్ రాసుకుంటున్న దినకర్ వినిపించుకోలేదు.

''చూడండి ! మంచివాళ్లేమో కదూ ! ప్లీజ్ ! అల్లుడుగారేమో !''

'' ఉండనిద్దూ ! ఏదో రాంగ్ నంబరయి ఉంటుందిలే'' కల్లీ చొక్కా తొడుక్కుంటూ అన్నాడు.

ఫోన్ రింగ్ అవుతూనే ఉంది.

''ప్లీజ్ ! చూడండీ ! అమ్మాయి పిలుస్తోందేమో''

పెర్‌ఫ్యూమ్ స్ప్రే చేసుకుంటూ భార్య వంక అద్దంలో చూశాడు దినకర్.

–గబగబా చీర చుట్టుకుని బయటకు వచ్చేసింది మంజూ.

''శశా ?.... ఏ నంబరు కావాలండీ మాకు... ఓ.. శశా ?... వస్తోంది. బాత్‌రూమ్‌లో ఉంది. జస్ట్ ఎ మినిట్ !'' ఫోన్ క్రింద పెట్టి 'మంజూ !' అని పిలిచాడు దినకర్.

'' ఆఁ !... మంజూ... ఆఁ!... రావే !... ఇక్కడి వరకూ వచ్చి తెలుసుకోలేకపోతున్నావా ! బయట వరండా మీద లైటు వేసినేను గేటు దగ్గరే నుంచుంటా.... సరేనా... ఆటోలో కదా... సరే''

–మంజుల గబగబా బొట్టుపెట్టుకుని పూల చెండు సిగలో పెట్టుకుంటూ బయటకు వెళుతుంటే అడిగాడు దినకర్.

'' ఏమిటో ఈ హడావుడి ?''

''రండి ! బయట నుంచుందాం... మా క్లాస్‌మేట్ సంధ్య, ఎన్నాళ్లయిందో చూసి. నన్ను అసలు గుర్తుపట్టగలదో లేదో''

''నేనెందుకులే. నువ్ ఉండు''

దినకర్ పడక గదిలోకి వెళ్లిపోయాడు. అతని చొక్కాకి రాసుకున్న సెంటు మాత్రం గేటు దగ్గరే ఉండిపోయింది.

–''అమ్మయ్య !... శశీ వచ్చావ్‌గా... ఎంత బెంగపెట్టుకున్నానో నిన్ను చూడగలనో లేదో అని''

ఆటో దిగకుండానే గలగల మాటాడేస్తోంది సంధ్య.

అబ్బ ! ఏమిటే ఈ సౌరభం !'' చుట్టూ చూసింది ఆమె.

''రా, లోపలకిపోదాం...'' అంది నవ్వుతూ మంజు.

''శశి ఉందా అంటే... ఏమిటీ ఆయన అంత ఆశ్చర్యపోయారు... నాకు అర్థం కాలేదు.''

''కూచో ! అయనదంతా ఓ బడాయిలే... మా పెళ్లయిన మరుసటిరోజే నా పేరు మార్చేశారు.... లేకపోతే మేమిద్దరమూ కాపురం చెయ్యడం అసాధ్యమట'' వివరించింది మంజు.

''మంచి చమత్కారమే... అబ్బ ! అప్సరసలా ఉన్నావే... తెల్లచీర... మల్లెపూలు... వాలుజడ నిజంగా పెళ్లికూతురులా ఉన్నావ్''

బోల్డు సంబరపడిపోయింది స్నేహితురాలు.

'' ఏమండీ...'' గదివంక తిరిగిపిలిచింది శశి సంధ్యా ''నా మాటకేంగాని... నువ్ విడీవిడని సంపంగి మొగ్గలా ఉన్నావే... ఇంత అందం ఏ మాత్రం ఖర్చు చెయ్యకుండా... ఎంత గట్టి మనసే నీది !''

''సంపంగీలేదు. సంబడమూ లేదు... ఊరుకో... బావగారు వింటే బాగుండదు'' అంటూ సంధ్య చొరవగా దినకర్ ఉన్న గది ద్వారం వరకూ వెళ్లి అక్కడ ఆగిపోయింది. లోపలకు వెళ్లింది మంజు.

''సంధ్య వచ్చిందండీ !''

''అబ్బ ! ఇప్పుడా ?....'' అన్నాడతను నిట్టూర్పులా, మెల్లగా.

'' ఏమండోయ్, బావగారూ...'' అంటూ సంధ్యలోపలకి వచ్చేసింది.

ఐదు అడుగుల ఎనిమిది అంగుళాల మనిషి మంచం మీద నుంచి దిగి నుంచున్నాడు.

తెల్లటి పంచ, ఖాదీ సిల్కు తెల్లటి కల్లీ లాల్చీ... ఘుమఘుమలాడిపోతున్న గుబాళింపు...

ఇద్దరినీ పక్కపక్కనే చూసింది సంధ అలా చూస్తూ ఉండిపోయింది.

ఎన్ని కేసులలోనో ప్రతికక్షుల్ని చిత్తుచేసిన దినకర్ అకస్మాత్‌గా తన వంక చూస్తున్న ఆ రెండుకళ్లనూ చూసి అబ్బురంతో చేష్టలుడిన – పంతులమ్మ చేత చిలిపి చేష్టలు చేస్తూ పట్టుబడిగి బడిపిల్లడిలా కుంచించుకుపోయాడు.

–''క్షమించండి బావగారూ... మరదలి పిల్లని రాకరాకవచ్చా ! ఈ రాత్రికి ఇక్కడే వుంటా...''

అతని కళ్లలోకే చూస్తూ అంది.

''తప్పకుండా...''

''మీరింతటి ఘనులని మాశశి చెప్పకుండానే తెలుసుకున్నా... రావేశశీ– ఇంతమత్తెక్కించే సుగంధం తట్టుకోలేను''

అప్పుడు దినకర్ ఆమె కళ్లలో నుంచి తన కళ్లను తిప్పుకుని నిదానంగా ఆమెను చూశాడు.

తెల్లగా, సన్నగా, పొడుగ్గా, నాజూకుగా హుందాగా మాడ్రన్‌గా ఉంది సంధ్య. మంజూ కంటె కాస్త పొడుగు. మంజూ కళ్లలోలేని యవ్వనపు చిలిపి వెలుగు.

–''మంజూ ! ఎంత పనిచేశారు బావగారూ... ఎంతగానో కష్టపడాల్సి వస్తోంది మంజూ అని పిలవడానికి. మీ అమ్మాయి పెళ్లికి రాలేకపోయాను...''

''గ్రీటింగ్స్, గిఫ్టు రెండూ అందాయి...'' దినకర్‌కి కొత్త అనే మబ్బు తొలగిపోయింది.

''అమ్మాయి పెళ్లిఫోటోల ఆల్బం...'' తన చేతిలోని ఆల్బమ్‌లలో నుంచి ఒకటి తీసి ఇచ్చాడు.

సంధ్య మారుమాటాడకుండా ఆల్బం తీసుకుని డ్రాయింగ్ రూమ్‌లోకి నడిచింది.

దినకర్ చేతిలోని రెండవ ఆల్బం చూసి మంజూ మురిపెంగా చిరునవ్వు నవ్వింది.

''రండి ! బాగుండదు !'' అంది మెల్లగా.

'' ఊహు !''

ఆమె అతని చెయ్యి పట్టుకుని లాగింది.

''నువ్వెళ్లు... ఆమె ఎవరో తెలియందే... నేనేం మాటాడను ?''

''అబ్బరండి ! నా మీద ఒట్టే !''

– ఇద్దరూ వచ్చి కూచున్నాక అంది సంధ్య.

'' ఎలా అయితేనేం తీసుకురాగలిగేవు...'' కాశీ ప్రయాణంందగ్గర ఫోటో చూస్తూ అంది సంధ్య.

'' ఆఁ ఏదోలే !.. నీ అభిమానం..., ఇన్నాళ్లకు వచ్చావు. నాకెంతో సంతోషంగా ఉంది'' మంజూ

సంధ్య చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అంది.

''అమ్మాయి అచ్చం వాళ్లనాన్నగారి పోలికే సుమా !'' తలంబ్రాలు వరుడి తలమీద పోస్తూ వయ్యారంగా కెమేరా వంక చూస్తున్న వధువు ఫోటో చూస్తూ అంది సంధ్య.

దినకర్ చేతిలో ఆల్బం తిరగేస్తున్నాడు.

ఏడడుగులూ హోమం చుట్టూ నడుస్తున్న ఫోటో...

''అమ్మాయి అత్తారిల్లు ఎక్కడ ?''

'' ఈ ఊర్లోనే...''

–విరబూసిన వెన్నెల – మల్లెల పరిమళం... కర్పూర మాలల వింత సౌరభంలో ధవళాంబరాలు ధరించిన నవవధువు... ఆటోక్లిక్ కెమెరాను ఫోకస్ చేసి ఉంచి మంజూ పక్కచతికిలపడ్డాడు తను...

ఎప్పుడది ?

నిన్ననే... నిన్ననే...

చేతిలో అమృతకలశంతో అప్సరాంగన... పొడవైన వాలుజడ – సిగ్గుదొంతరలతో – వంచుకున్న తలలో నుంచి విడుతున్న మల్లెలు నవ్వుతుండగా తలుపుతోసుకొని లోపలకి వచ్చింది.

పురివిప్పిన నెమలి అందంగా హేలగా అడుగు ముందుకువేసింది.

వెన్నెల గదిలోకి వచ్చినట్లుంది. ఆకాశం భూమిని వెలుగులో చుట్టేసింది.

మల్లెలు ఫక్కుమని నవ్వాయి, ఏమిటా సుగంధం! ఏమిటా వెలుగు! ఏమిటా కదన కుతూహలం! ఏమిటా ఆనందలాస్యం! ఏమిటానాట్యహేల!

ఫోటో ఆల్బంలో ఒకచోట దినకర్ మనసు మరో లోకంలోకి వెళ్లిపోయింది. కళ్లముందు ఏవో వెలుగులు.... ఏవో జ్ఞాపకాలు... ఏవో పులకరింతలు..

మరో చిత్రం కళ్లముందు సాక్షాత్కరించింది. మరో మైమరపు.

''మంజూ !''

''.......''

''నిన్నే !''

'' ఆఁ!''

'' ఆశ్చర్యపోకు... దినకరుడూ, శశికళ రెండూ కలిసి సహజీవనం చెయ్యడం అసాధ్యం, నువ్ నాదానివే. నన్ను మంజూ అని పిలుచుకోనియ్.... ఈ అమృత ఘడియ ఇలానే కలకాలం ఉండిపోవాలి... ఈ శుభఘడియ అమృత ఘడియకావాలి. ఈదేవి ఈ వరం నాకు ప్రసాదించవలసిందే...''

ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని గుండె మనసులో బంధించాడు తను.

ఆమె ముసిముసినవ్వులు నవ్వింది.

వెన్నెట్లో కృష్ణవేణి మిసమిసలాడింది. చందన భూరుహంలో నుంచి మలయవీచిక మందగమనం చేసింది. హరివిల్లు కౌగిట నిలచేవేళ... జగన్మోహిని అమృతం పంచి ఇచ్చే స్నిగ్ధ మంగళ ముహూర్తం.

వాలుజడలోని పూలు ఒక్కచిరునవ్వుతో పలకరించి చెంగున వెనక్కుమరలాయి.

ఆ నవ్వులు అలానే ఉండనీ..... నీకూనాకూ మధ్య ఈ పూలబాలలు బోసినవ్వులు వసంత

గీతాలను ఆలపించనీ....

''మంజూ!''

''ఆఁ!''

''ఏమిటా పరాకు!''

''కాదు ....భావోద్దీపన...మధుకైశికీనాదం

మంగళ దీపారాధన, జీవన నవశకానికి కర్పూర హారతితో ఆహ్వానం.....''

''నిజం!'' ఏదీ మరోసంగతి ....మరో తానం .....మరో రాగం ....''

''మనోవీధిలో తేనె తెమ్మరల ఆహ్లాదాలాపన''

ఇంకా...''

''వసంతగీతిక వచోలాస్యానికి నటభైరవి అమరాహ్వానం .... చాలా ?''

''మత్తురగిలించే దివ్యానుభూతికి ఆపదేముంది ?''

సన్నని సన్నాయి మంగళవాద్యం, రెండు తనువుల ఆహ్లాద యుగళగీతం

''బావగారూ ! చాలా సేపయిచూస్తున్నా ! .... తమ దివ్యానుభూతికి కారణం ?''

సంధ్య దినకర్ చేతిలోనుంచి ఆల్బంతీసుకుంది. అట్టమీద తేదీ ఆమె ఉచ్ఛ్వాసాన్ని ఒక్కక్షణం ఆపేసింది ....తృటికాలం ఆమె గుండె లయతప్పింది.

ఇరవై పదీ యాభై ఎనిమిది, సరిగ్గా పాతికేళ్ళ క్రిందట శశి పెళ్ళిఫోటోల ఆల్బం.

తనెంత పెద్దదయిపోయింది ! తలలో చాలా భాగం జుట్టునెరిసిపోతోంది.

మంజూ యింకా పెళ్ళికూతురిలా, శోభన మందిర ప్రవేశం చెయ్యబోయే కలువకన్నెలానే ఉంది.

....నిజంగా తనశశే ఇది ...తననేస్తం....తన నెచ్చెలి....తన సహాధ్యాయి

అతివను నిత్యనూతనంగా, నవవధువులా నిలబెట్టగలిగేది వివాహమేనా ?

తనెందుకు కాదు, అది ఘోరమైనతప్పిదమేమో ! ....

సంధ్య ! రాకరాకవచ్చావ్, మాతోపాటు భోజనం చెయ్యాల్సిందే ..ః''

''ఇంతకమ్మటివిందు నేనెన్నడూ అరగించలేదు మంజూ! నాకడుపు నిండిపోయింది. ఇంత సుదీర్ఘైన జీవితంలో ఈనాటితృప్తి ఆనందం'' సంధ్య ఏదోచెప్పాలనుకుంటోంది.

''ఇంత సుదీర్ఘమైన యవ్వనంలో '' బయటకుఅనేశాడు దినకర్; ఆమెకళ్ళలోకి ఆత్రంగా చూశాడు.

ఆ వెలుగులమధ్య నీడలు !

నడివయసులో జొరబడిన మంజూ కళ్ళలో వెలుగుల తళతళలు తమ అతిథికళ్ళలో నీడలు ఎందుకు ... ఎందుకో ?

''మంజూ, మీ స్నేహితురాలు ఒక్కరే వచ్చారు ? '' అంతవరకూ ఏదో లోకంలో విహరించినా ఆల్బంచేతిలోనుంచి వెళ్ళిపోగానే కల కరిగిపోయింది. ఊహాలోకంలో నుంచి వాస్తవంలోకి దిగివచ్చాడు దినకర్.

'' మా తమ్ముడూ మరదలూ, ఎవరింటికో విందుకు వెళ్ళారు. నేనిక్కడకు వచ్చాను. నే

ఉండేది రెండురోజులే అయినా వాళ్ళ విందుకు నేనెందుకు అడ్డురావాలి ? మీ ఫోన్ నంబరు ఎప్పుడో నోట్ చేసుకున్నా .... మీశశిని చూడగలిగాను. అంతేచాలు ... అమ్మాయి ఉత్తరాలు రాస్తోందా ! అన్నట్టు ఇక్కడే వుందన్నారు కదూ ! ఏదో మైమరపు ...

''.రా లోపలకు వెళదాం.... నువ్ రాత్రి వేళ అన్నమైనా లేక ....''

''ఏదయినా పరవాలేదు .... పథ్యం చేయాల్సిన అవసరం ఇప్పటికింకా రాలేదు ...''

''అదృష్టం ! .... నేనూ, మీ బావగారూ సూఖారొట్టెలే .... తేలికగా ఉంటుందిలే ...''

''ఒక్క పదినిముషాలు'' దినకర్ తెలివిగా పక్కగదిలోకి తప్పుకున్నాడు.

''శశీ ! ''

పరాకుగా పిండి ఉండలు చేస్తున్న స్నేహితురాలు వినిపించు కోలేదు ...

''శశీ! ''

''ఆఁ ! ''

''నేనూ నిన్ను మంజూ అని పిలవచ్చా ? ''

''అబ్బ ! ఏమిటే అది .... మనం కలసి చిలిపిగా ఆడుకున్న రోజులు కలసిచదువుకున్న రోజులూ జ్ఞాపకం వస్తున్నాయి ... అవునే ...''

అడగబోతున్న ప్రశ్నను అడగకుండానే ఆపేసింది మంజు. ఒక్కలిప్తలో ఆమెమనసు తమ కాలేజీరోజుల్లోకి రివ్వున ఎగిరిపోయింది.

''సంధ్య ... మీ స్నేహితురాలు ... లేరాండీ ''

అతను అడిగాడు ఎంతో బిడియంతో ఎంతో మర్యాదగా

''సంధ్యతో మీకేం పని ?'' తను రుసరుస లాడింది.

క్షమించాలి ... ఆమె ... నన్ను ...నన్ను' ''రమ్మందా ?''

''ప్రేమిస్తోంది ...'' అతని ముఖంలో ఏదో మొండిధైర్యం.

'' నిజంగా ! ''

''మరి ... మీరు, దాన్ని ....''

''పూర్తి మనసుతో .... '' అతను తడబడలేదు

'' మరి ఆమాటనాకు చెప్పకుండా ...మిమ్మల్ని పిలిచితను ఎందుకువెళ్ళిపోయింది ?'' తను నిలదీసి అడిగింది.

''అదే తెలియడంలే ! ''

''మిస్టర్ మనోహర్ ! మీ వాళ్ళు ఈ పెళ్ళికి ఒప్పుకుంటారా ?''

''ఒప్పుకోకపోయినా నేనుచేసుకుంటా ! ... దయచేసి నా సంధ్యతో నామాటగా చెప్పండి .. నే వచ్చి వెళ్ళాననీ చెప్పండి....ప్లీజ్! ''

అతను వెళుతూ ఉంటే ఆ ఫంట్లాం షార్క్స్కిన్‌ది కాబోలు .. అదోలా చప్పుడయింది.

''వాళ్ళకట్నకట్నాలు కావాలంటే ... నాకయితే కట్నంఇచ్చి భర్తనికొనుక్కోవడం ససేమిరా ఇష్టంలేదు. ఈమాట నేనతనికి చెప్పడంనాచేత కావడంలేదు. నే సినిమాకు పోతున్నా ''

సంధ్య చెప్పే వెళ్ళింది.

గత ఎనిమిదినెలలుగా ఏపూట జరిగిన విషయం ఆపూట వివరంగా పూసగుచ్చే సంధ్య అలా అలా ఆశలు పెంచుకుంటూ చటుక్కున ఈ మాటలు చెప్పి గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది. సినిమానుంచి తిరిగివచ్చి మనోహర్ వచ్చాడా అని అడగనయినా అడగకుండా చీరయినామార్చుకోకుండా అలాపడుకుని నిద్రపోయింది.

తెల్లవారి తనకే మనసు ఉండబట్టక అంది.

''పెద్దవాళ్ళ మాట కాదనలేని మొగాడు... ప్రేమించేధైర్యం ఎక్కడ కూడబెట్టాడో ....'' తనే కలగచేసుకుంది.

''శశీ ! ప్లీజ్ ! నీకు పుణ్యం ఉంటుంది.....ఆ ప్రస్తావన మరితేవద్దే .... మన స్నేహం మీద ఒట్టు ! ''

–అంతే కాలేజీ చదువు అయిపోయింది... ఇద్దరూ విడిపోయారు.... మరొకసారి ఆ ప్రస్తావన తీసుకురాలేదు శశి.

... ఈ రోజు... ఈ రోజు అడగకుండా ఉండలేకపోయింది. మనోహర్ కట్నానికే అమ్ముడుపోయాడా?

అమ్మాయికి నచ్చినసంబంధమని తెలిశాక ఆమెకు తెలియకుండానైనా కట్నం ఇచ్చి ఆసంబంధమే ఖాయం చేయడానికి సంధ్య తల్లిదండ్రులు ప్రయత్నం చెయ్యలేదా ?

కట్నం ఇవ్వకూడధనే ఆదర్శం ఉంటే మాత్రం మనోహర్ లాంటి మనిషి మరెక్కడా తారసిల్ల లేదా సంధ్యకి ?

''అవునే... అతను... అతను... మనోహర్ ఎక్కడున్నాడు ?'' మంజూ అడిగింది నిజంగా తెలుసుకోవాలనిపించి అడిగింది.

ఏం లాభం.... అతను ఎక్కడున్నాడన్నది అప్రస్తుతం. తీరా అడిగాక అనిపించింది.

సంధ్య ఒంటరిగా మిగిలిపోయిందన్నది సత్యం. అయినా అడగరానిదేదో అడిగేసింది.

''నా మనస్సులో !'' సంధ్య ఠక్కున చెప్పింది.

''మరి...?'' తెల్లబోయింది మంజూ.

''మరేముంది ? మరంతే ! పేరులోనే ఉంది. నువ్ ఎంత అదృష్టవంతురాలివే... బావగారు నిన్ను ఒక్కక్షణం కూడా.''

'' ఆс! ఆయనదంతా అదో బడాయి. అమ్మాయి అత్తారింటికివెళ్లిపోయిందా ? క్లబ్బు మానేశారు. నాకోసమేనట !...''

'' ఓ ! అదా ! అదినీ అదృష్టం... పాపం నేను వచ్చి మీ ఏకాంతాన్ని భంగపరచాను'' ఏమనాలో తోచక బయటకే అనేసింది సంధ్య.

''మీరు రావడానికెంతో సంతోషంగా ఉంది మీరు, మీ స్నేహితురాలూ కనీసం ఓ నాలుగు రోజులయినా ఉండాల్సిందే. అమ్మాయికి ఫోన్ చేసి పిలుస్తా'' దినకర్ దగ్గర చందనం సువాసన.

''అల్లుణ్ణి కూడా పిలవండి !''

'' ఇప్పుడే ?'' దినకర్ కంగారుగా అడిగాడు.

'' ఒద్దులెండి !'' బయట కారుహారన్ వినిపించడంతో చటుక్కున అంది సంధ్య ''నే మరొకసారి

వస్తా! మావాళ్లు వచ్చారు. ఇప్పటికే బాగా పొద్దుపోయింది'' ఆమె దిగ్గున లేచింది.

దంపతులిద్దరూ ఎంత వారిస్తున్నా ఆమె వెళ్లిపోయింది.

వెళ్లిపోతున్న కారు వంకే చూస్తూ ఉండిపోయారు. దినకర్, శశీ – కాదు దినకర్, మంజూ.

**స్వాతి సపరివార పత్రిక**

17-5-85.